వరికి ఉరి


వరినాట్ల కోసం ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు

- ఈసారైనా గిట్టుబాటు ధర కల్పిస్తారా?
- అయోమయంలో వరిసాగు రైతులు
- ఖరీఫ్‌లో వరిసాగును అదునుగా భావిస్తున్న రైతులు
- అన్నదాత సుఖీభవ డబ్బుల కోసం ఎదురుచూపులు

తాళ్లూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వ్యవసాయం చేసిన రైతులు అన్ని విధాలా లాభపడ్డారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇచ్చి పెట్టుబడి సాయం సకాలంలో ఇచ్చారు. రైతు భరోసా డబ్బులు సకాలంలో రైతుల ఖాతాలకు జమ కావడంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా ఉండింది. ప్రతి రైతు అధిక లాభాలతో రైతే రాజుగా నిలిచాడని అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుకు భరోసా స్థానం కూడా కల్పించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హామీల్లో చెప్పిన అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇప్పటికీ ఇవ్వలేదు. ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు అదునుగా భావిస్తున్న రైతులు దాని కోసం డబ్బులు అప్పుగా తెచ్చుకోవాల్సి వస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు దాదాపు 3 వేల ఎకరాల్లో చేపట్టాలని అధికారులు చెప్తున్నారు. పొలాలను ఖాళీగా ఉంచలేక అధిక పెట్టుబడులైనా పండిచిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తారనే నమ్మకంతో డబ్బులు అప్పుగా తెచ్చుకుని మరీ రైతులు వరి పంటలు పండించేందుకు సిద్ధమవుతున్నారు.

ఆకాశాన్ని అంటుతున్న పెట్టుబడులు

గత ప్రభుత్వంలో పెట్టుబడులకు తగినట్లుగా పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించారు.


వరినాట్లు వేస్తున్న కూలీలు

అంతేకాకుండా రైతు భరోసా డబ్బులు అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచిత్రమైన వాతావరణంతో పంట తెగులు వచ్చి నష్టం అధికంగా జరిగింది. దానికి తోడు ఎరువులు, విత్తనాలు, కూలీలు, ట్రాక్టర్ దున్నేందుకు ఇలా అధిక ధరలు ఉండటంతో పంటలు వెయ్యాలా వద్దా..అని రైతులు అయోమయంలో ఉన్నారు.

పశుగ్రాసమే దిక్కు

కూటమి ప్రభుత్వం ఇస్తున్న ధర చూస్తే పంట దిగుబడికి పెట్టుబడులకు సరిపోతుంది. వరి పంట నుంచి వచ్చిన పశుగ్రాసమే చివరకు మిగులుతుంది. పెట్టుబడుల కోసం అప్పుగా తెచ్చిన డబ్బులు వెంటనే చెల్లించేందుకు వడ్ల గింజల ధర తక్కువగా ఉన్నా రైతులు దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరమైనా వరి పంటకు కూటమి ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర నిర్ణయించాలని రైతులు కోరుతున్నారు. మంచి లాభాలు వచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.


వరిపైరుకు నీరు పెడుతున్న రైతు

పొలం ఖాళీగా ఉంచలేక వరి వేశా



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వడ్ల బస్తా 2400 రూపాయల వరకు ధర పలికింది. పంట దిగుబడి అధికంగా ఉండి మంచి లాభాలు వచ్చాయి. కూటమి ప్రభుత్వంలో 1200, 1400 రూపాయలు నిర్ణయించారు. అధిక పెట్టుబడులతో పాటు రేటు తక్కువ ఉన్నా పొలం ఖాళీగా ఉంచలేక రైతులు వరి సాగు చేస్తున్నారు. ఈ ఏడాదైనా గిట్టుబాటు ధర కల్పిస్తారనే నమ్మకంతో 4 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా.

– గూడా అల్లురెడ్డి, బెల్లంకొండవారిపాలెం, రైతు

రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నా



రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. 60 వేల రూపాయల పెట్టుబడి పెట్టా. ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక పోవడంతో భారీగా నష్టపోయా. అధిక పెట్టుబడుల రీత్యా మళ్లీ వరి పంట వేయాలంటే భయమేస్తోంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతులకు మేలు చేయాలి.

– గర్నెపూడి ఏసోబు, లక్కవరం, కౌలు రైతు

మొహర్రం సందర్భంగా అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

దర్శి: మొహర్రం పండగ సందర్భంగా పట్టణంలోని జండా చెట్టు వద్ద బుధవారం అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జెండా చెట్టు వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని అందరికీ మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన పీడీ


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ జోసఫ్‌కుమార్

కురిచేడు: జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులు జి. జోసఫ్‌కుమార్ బుధవారం మండలంలోని బోధనంపాడులో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలను స్వయంగా కలిసి మాట్లాడి కంపోస్టు పిట్స్ నిర్మించుకోవాలని సూచించారు. కంపోస్టు పిట్స్‌తో సొంతగా ఎరువు తయారు చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. ఉపాధి పథకం కింద నిర్మించిన యర్రయ్య గోకులం షెడ్‌ను సందర్శించి రైతులతో గోకులం షెడ్‌ల గురించి మాట్లాడారు. సర్పంచ్ పుల్లలచెరువు శశికళ, ఉప సంచాలకులు ఆర్.లలితకుమారి, ఏపీఓ దేవయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉత్తమ ఫలితాలు

తాళ్లూరు: క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని ఎస్సై ఎస్.మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని శివరాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలపై వివరించారు. కానిస్టేబుళ్లు దారా బ్రహ్మనాయుడు, కోటా వెంకటేశ్వర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మౌలిక వసతులు


ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఎం సత్యనారాయణ

పెద్దదోర్నాల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సౌకర్యాలను సమకూర్చేలా చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పర్యవేక్షణ లోపించిందని, దీంతో ఆర్టీసీ ఆదాయానికి తీవ్రంగా గండి పడుతోందని సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తంగిరాల రామిరెడ్డి ఆయనకు తెలిపారు. అనునిత్యం వందలాది బస్సులు రాకపోకలు సాగించే పెద్దదోర్నాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ కంట్రోలర్‌ను సైతం నియమించకపోవటం ఏంటని ప్రశ్నించారు. పర్యవేక్షణ లేక పోవటంతో ఆటోలు, జీపులు, ప్రైవేటు వాహనదారులు తమ ఇష్టారీతిన ప్రయాణికులను ఎక్కించుకుని ముఖ్యమైన రూట్లలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారన్నారు. మార్కాపురం డిపో మేనేజర్ నర్సింహులు, గంటా గురవారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల చట్టాలకు తూట్లు


వై.పాలెం: పోస్టాఫీసు ఎదుట నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

కురిచేడు: కార్మికుల చట్టాలకు బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య అన్నారు. బుధవారం దేశ సార్వత్రిక సమ్మె సందర్భంగా కురిచేడులో కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. పంచాయతీ ఆఫీసు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. ర్యాలీలో పంచాయతీ కార్మికులు, స్వచ్ఛ భారత్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వీవోఏలు, ముఠా కార్మికులు పాల్గొన్నారు. కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు, ఉద్యోగులు పోరాడి తెచ్చుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ అమలు చేస్తున్నారని విమర్శించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. అనంతరం రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. సమ్మెలో పంచాయతీ కార్మికులు అశోక్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, స్వచ్ఛ భారత్ కార్మికులు పాల్గొన్నారు.

■ **దొనకొండ:** సీఐటీయూ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో భాగంగా కార్మికులు బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చారు. సీఐటీయూ మండల కమిటీ కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. తహసీల్దార్ బి.రమాదేవికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. స్పందించిన తహసీల్దార్ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని హామీ ఇచ్చారు. సీఐటీయూ అధ్యక్షుడు కుందుర్తి చిన్న నరసింహులు, వ్యవసాయ సంఘ కార్యదర్శి కర్నా హనుమయ్య, కొండా ఏసుదాసు, బాలకోటయ్య, గుడిమెట్ల ఆదాం, గురవయ్య, రమణారెడ్డి, వెంకటస్వామి, కిరణ్‌కుమార్, సంతోష్, కరుణ, రాణి, రోజమ్మ పాల్గొన్నారు.

■ **దర్శి:** మోదీ ప్రభుత్వానికి చమరగీతం పాడితేనే కార్మికుల హక్కులు సాధించుకోగలుగుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి ఎర్రజెండాలు, కార్మికుల నినాదాలతో పొదిలి రోడ్డు, కురిచేడు రోడ్డు, అద్దంకి రోడ్డులో ప్రదర్శన నిర్వహించి గడియారం స్తంభం సెంటర్‌లో షేక్ బాషా అధ్యక్షతన సభ నిర్వహించారు. రంగారావు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుంచి కార్మికులు, ఉద్యోగులు పోరాడి తెచ్చుకున్న 29 రకాల కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద, మధ్యతరగతి, ఉద్యోగ, కార్మికులపై భారాలు వేస్తూ మరోవైపు కార్పొరేట్ శక్తులకు మోదీ అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల్లో 16 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకు రుణాలు రద్దు చేశారని విమర్శించారు. మోదీ ప్రభుత్వానికి చరమగీతం పాడితేనే కార్మికులకు రక్షణ ఉంటుందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌కు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ దర్శి అధ్యక్ష, కార్యదర్శులు బాషా, ఉప్పు నారాయణ, గర్నెపూడి జాన్ సామ్యేల్, గోగు వెంకయ్య, అంగన్‌వాడీ, ఆశా, క్లాప్ మిత్ర నాయకులు జయమ్మ, తిరపతమ్మ, సుశీల, మాధవీలత, లక్ష్మి, ఆలూరి ఇస్రాయిల్, పోరుమామిళ్ల వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, అంజిబాబు, మల్లేశ్వరి పాల్గొన్నారు.


కురిచేడు: డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

■ **యర్రగొండపాలెం:** సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ, ఏఐటీయూసీ చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం స్థానిక బ్యాంకులు, పోస్టాఫీసులను మూయించి వేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య మాట్లాడుతు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటంలో ఉద్యోగులు, కార్మికులు, రైతులు భాగస్వాములు కావాలన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, అప్రెంటిస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కృష్ణగౌడ్, మన్నె సాంబశివరావు, వై.వెంకటశివయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, ఆవుల యోగయ్య షేక్ పీరా పాల్గొన్నారు.

■ **పెద్దదోర్నాల:** కాంట్రాక్ట్ కార్మికుల గౌరవ వేతనం ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని రైతు సంఘ జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో దేశవ్యాప్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో ఆశా కార్మికులు, మధ్యాహ్నం భోజన కార్మికులు, పంచాయతీ కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులు 104, 108 వాహనాల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫ సెంటర్ సీహెచ్‌సీ, ఏఎన్ఎం, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన ప్రదర్శన చేశారు. నిరసన ప్రదర్శన పంచాయతీ కార్యాలయం నుంచి పోలీస్‌స్టేషన్, ఫారెస్ట్ ఆఫీస్ మీదుగా మార్కెట్ యార్డ్ వరకు సాగింది. అనంతరం నటరాజ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ ముంతాజ్, వెంకటలక్ష్మి, ఉమాదేవి, సుభాషిణి, అలివేలు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు సిపోరా, ప్రావీణ్య, రాణెమ్మ, కోటేశ్వరి పద్మావతి, పంచాయతీ కార్మికులు అరుణ్, శ్రీనివాసులు, బిక్కు సాహెబ్, గ్రేస్మేరీ, ఆరోగ్య మిత్ర యూనియన్ నాయకులు ఎం.చంద్రశేఖర్, రైతు సంఘం మార్కాపురం డివిజన్ కార్యదర్శి డి.తిరుపతిరెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

■ **దర్శి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా దర్శిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. దర్శి పట్టణంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అనంతరం ఏఐటీయూసీ దర్శి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరావు అధ్యక్షతన గడియార స్తంభం సెంటర్లో జరిగిన సభలో హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు తాకట్టు పెట్టే పనిలో ఉన్నారని విమర్శించారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి మాట్లాడుతూ తాను అధికారంలోకి వస్తే విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని వెలికి తీసుకొచ్చి ప్రతి పేదవాడికి రూ.15 లక్షలు అకౌంట్లో వేస్తానని చెప్పి మూడుసార్లు అధికారంలోకి వచ్చినా ఒక్క రూపాయి ఏ ఒక్కరికి వేసిన దాఖలాలు లేవని దుయ్యబట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి సింగరకొండ శ్రీను, విజయ్, ఆరునూరి బాబు, కల్లూరి పెద్ద ఆంజనేయులు, మున్సిపల్ వర్కర్ నాయకులు ఇత్తడి ఇరిమియా, గొంగటి శ్రీకాంత్, నవీన్, దావీదు, హమాలి వర్కర్స్ నాయకులు వి.శ్రీను, బిజ్జాల శ్రీను, అరుణమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కె.శ్రీదేవి, ఆరునూరి నాగమణి, రమాదేవి, ఆదిలక్ష్మి, సామ్రాజ్యం అధిక సంఖ్యలో కార్మికులు, మున్సిపల్ హమాలీ కార్మికులు పాల్గొన్నారు.


పెద్దదోర్నాల: మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు


దర్శిలో సమ్మె చేస్తున్న సీఐటీయూ నాయకులు

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ

కురిచేడు: మండలంలోని బూత్ లెవల్ అధికారులకు బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఒక రోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి ఎస్.జాన్సన్, తహసీల్దార్ జి.రజనీకుమారి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ టి.దేవప్రసాద్‌లు బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఆర్‌పీ యాక్ట్ 1950 సెక్షన్లు, బూత్ లెవల్ ఏజెంట్లు, బూత్ లెవల్ అవేర్నెస్ గురించి, బీఎల్ఓ యాప్ గురించి వివరించారు. ఆన్‌లైన్‌లో బూత్‌లెవల్ అధికారులకు పరీక్ష నిర్వహించారు. అనంతరం బీఎల్‌ఓలకు సర్టిఫికెట్లు అందజేశారు.


బీఎల్‌ఓలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు

నిషేధిత పదార్థాలు విక్రయించే వారిపై చర్యలు

పెద్దదోర్నాల: ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు బుధవారం పట్టణంలోని మత్తు పదార్థాల విక్రయంపై పోలీసులు ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. ఎస్సై వి.మహేష్ ఆధ్వర్యంలో స్కూళ్లు, కాలేజీలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న షాపులపై దాడులు చేసి తనిఖీలు చేపట్టారు. గుట్కా, సిగిరెట్ వంటి నిషేధిత పదార్థాలను విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసిన పలువురిపై జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. ఇంకా ఎక్కడైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల వద్ద విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసే అంశాలను అరికట్టేందుకు పోలీసులు చేపట్టిన ఈ చర్యలపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై వెంట స్టేషన్ రైటర్ మోహన్, రాజా పాల్గొన్నారు.


దుకాణాల్లో తనిఖీ చేస్తున్న ఎస్సై మహేష్